


# ఏదో జరుగవలసి ఉంది

'ఇక తనకెవ్వరూ లేరు..'అనుకున్నాడు తేజ.

ఆ రాత్రి ట్యాంక్‌బండ్ కుర్చీపై కూర్చుని నిశ్శబ్దంగా నీళ్ళలోకి చూస్తున్న తేజకు ఎంతో దుఃఖంగా, ఎంతో అసహనంగా, ఎంతో వ్యాకులంగా ఉంది.

ప్రక్కన ఒక గుడ్డ సంచీ..

అందులో తన యూనివర్సిటీ బంగారు పతకం, సామాజిక శాస్త్రంలో మొన్ననే తీసుకున్న పి.హెచ్‌డీ పట్టా..ఇతర సర్టిఫికేట్లు-

తనది ఒంటరి ప్రయాణం ఇక.

ఎటు..?

ఎటో.!

వెంట..వెనుక..ముందూ..ఎవరూ లేరు.

రెండు కాళ్ళవైపు చూచుకున్నాడు..ఎందుకో., చేతులవైపు కూడా

చూచుకున్నాడు..

ఎదురుగా చీకట్లో హుస్సేన్ సాగర్ మురుగునీరు..దాని తాలూకు దుర్వాసనను నింపుకుని చల్లని గాలి.

గాలి...శక్తివంతమైంది..జీవికి ప్రాణమైంది..ఊపిరయ్యేది...

ఐతే..దుర్వాసనను ఒంటినిండా పులుముకుని.,

## 2

'రైలు కిందపడి విద్యార్థిని దుర్మరణం'

ఎర్రగా రక్తం..కంకర రాళ్ళపై..పట్టాలు..అటు తల..ఇటు మొండెం.. దూరంగా విసిరేయబడ్డ పుస్తకం.

పేజీలు రెపరెప.. $E=mc^2$. ఐన్‌స్టీన్ సమీకరణం

చుట్టూ జనం..కాకులు..కావ్‌కావ్..కావ్‌కావ్..

పరుగెత్తుకొస్తూ దూరంనుండి మరోరైలు..గుండెలను చీల్చే సైరన్... నూటా ఎనిమిదిని పిలవండి..ఆరోగ్యశ్రీతో తెలుగు తమ్ముళ్ళు, చెల్లెమ్మలు కట్టబెట్టిన అదికారంను మననం చేయండి..భజన చేయండి..స్వకుచ, పరకుచ పరస్పర కుచ మర్ధనాలను..నిస్సిగ్గుగా మీడియా తెరలపై వీక్షించి తరించి..తనువు చాలించి.,

అయ్యా,

మూడు లక్షలపైచిలుకుపైగా ఎమ్సెట్ విద్యార్థులు..జుట్టుపీక్కుంటూ, ఇంటెన్సివ్ కోచింగ్‌లతో తలలు బద్దలు కొట్టుకుంటూ. డాలర్ డ్రీమ్స్‌తో పిచ్చికుక్కలై చైతన్యలూ, నారాయణల చుట్టూ పొర్లుదండాలు పెడ్తూంటే,

ఫిజిక్స్‌లో మూడు, కెమిస్ట్రీలో నాలుగు, మ్యాథ్స్‌లో రెండు తప్పులతో ఎమ్సెట్ పరీక్షా పత్రాలు విడుదల చేయబడి..మొదటి'కీ'., రెండవ'కీ', ఫైనల్ 'కీ' ప్రహసనాలు పేకాట కార్డ్సలా విసిరేయబడ్తూంటే...

ఒక ప్రశ్నకు రెండు సమాధానాలేమిట్రా రామలింగా.

అసలా తప్పులతో యుక్తముగా పేపర్‌ను సెట్‌చేసిన మూర్ఖ, హంతక ప్రొఫెసర్‌ను నడిబజార్లో సికింద్రాబాద్ స్టేషన్ ఎదుట నగ్నంగా నిలబెట్టి మానవ హక్కుల నేతల సమక్షంలో బహిరంగ విచారణ చేయకుండా..

ఉదాసీనత హత్యకంటే నేరంకదా..విస్మరణ ఆత్మహత్యకంటే హీనంకదా..

ఏం జరుగుతోందిక్కడ..;

ఆరువందల నలభై ఇంజినీరింగ్ కాలేజీలు, ఎనిమిది వందల ఎమ్బిఏ కాలేజీలు, ఎమ్సీఏ కాలేజీలు..

బందెల దొడ్డిలోకి..ఏటా లక్షా ఎనభైవేల నాన్ ఎంప్లాయబుల్ ఇంజినీర్స్..లక్షల ఎమ్బీఏ పోస్ట్ గ్రాడ్యుయేట్స్..

ఓరేయ్.. డాక్టరేట్ చేసి 'రెస్యూమె' ని కాపీకొట్టి తయారుచేసుకుని చంకలో పెట్టుకుని కార్పొరేట్ గడపలవెంట తిరుగుతున్న పుట్టుకతోనే వృద్ధుడవైన యువ భారతీయుడా, నీకు నీపేరు సరిగ్గా రాసుకోరాదు, అప్లికేషన్ అసలే రాయరాదు, తప్పుపోకుండా నాల్గు ఇంగ్లీష్ వాక్యాలు మాట్లాడరాదు..ఎలా.. ఏమిటీ తీరు.

విద్యాసంస్థల ప్రామాణికతను పరిశీలించడానికి 'ఇన్‌స్పెక్షన్' పేరుతో ఒక వ్యక్తి వచ్చి ముందు నిలబడ్తాడు..

వాడు నిలువెల్లా డొల్ల. మేనేజ్‌మెంట్స్ వినమ్రంగా బరువైన నగదు కవర్లతో చేతులు కట్టుకుని నిలబడ్తాయి.

వీడు 'ప్రమాణా'లంటాడు..లక్షలకు లక్షలు లంచాలు తీసుకుని పది గదుల్లో 'విశ్వవిద్యాలయాని'కి పర్మిషన్ ఇచ్చే దేశంలో..

విద్య ఒక చౌకడిపో కమాడిటీ.

రెండ్రూపాయలకు కిలో బియ్యం..ఉచిత టి.వి...ఉచిత విద్యుత్తు..ఉచిత నగదు బదిలీ..

ఒరేయ్ తండ్రీ..ఓటేయ్‌రా..నీకు ఉచిత వివాహ శోభనసహిత సర్వ సత్‌కాలక్షేప కార్యములనమర్చి నీముందు మోకరిల్లుతా..ఓటు..ఓటు ప్లీజ్.

పార్లమెంట్‌లో నూటా ఎనభై ఎనిమిది మంది కోటీశ్వరులు..నూటా ఎనిమిది మంది నేరచరితులు..మంత్రివర్గంలో తొమ్మిదిమంది క్రిమినల్స్.,

క్రిమినల్స్ మంత్రులేమిటిరా ఆంజనేయా..

ఒప్పందాలు..పొత్తులు..అవగాహనలు..స్నేహపూర్వక శతృత్వాలు... శతృపూర్వక స్నేహాల కౌగిలింతలు..మహాకూటమి..మహాఓటమి...మాయా కూటమి..

'పిల్లి కళ్ళుమూసుకుని పాలు త్రాగును..' అని కదా ఉవాచ.

రాఘవులు, నారాయణ, బాబు..వెనుక తోకవద్ద ఒక బాంబుప్రేలి అంతా కకావికలై..పరుగులు..విచ్ఛిన్నత..

జనం పరబ్రహ్మ స్వరూపులు..జనం మూర్ఖులు..జనం దుర్మార్గులు.. జనం లంచగొండులు..జనం న్యాయనిర్ణేతలు..

మీమాంసలు..ఓట్లశాతం మాది ఎక్కువ..మేమే ఓడిగెలిచాం..పావలా వడ్డీతో అరశాతమైనా మేమే గెలిచివోడాం..మైకుల విరుపులు..బల్లల చరుపులు.. అంగీలు చింపుకుని లైవ్ టెలికాస్ట్‌లో హీరోలై..ఎమ్మెల్యేలు కప్పల తక్కెడ నుండి పిల్లిమొగ్గలు వేయుచునే ఉందురు..అపరా డోలనాన్ని..వ్చ్.

మీడియాలో దేశ స్థితిగతులపై మేధావుల చర్చ,

మధ్య ఒక 'బ్రే..క్..మన దగ్గర ××× ఉందికదా..సంస్కారవంతమైన సబ్బులున్న చోట దుర్మార్గమైన సానిటరీ టవల్సుండవా'

అరే.. ఈ న్యూస్ రీడర్ నిన్న ఈటివీలో ఉండెగదా.. ఇప్పుడు 'సాక్షి'లో ఎలా..

దూకుడు దూకుడు..గోడ దూకుడు, కంచెలు దూకుడు..ఫ్యాట్ సాలరీకోసం..సరిహద్దులన్నీ దూకి..పదివేల కోట్ల దొంగలెక్కలు రాసి 'సత్యం'ను 'మెటాస్' చేసి 'మటాష్' చేసి తలక్రింద..క్రిందతల

ఓరేయ్ తండ్రీ డజన్ అరటిపండ్లు పన్నెండ్రూపాయలైతే పద్నాల్గు చెప్పి మోసం చేశావు గదరా..దేశం చెడిపోయింది..అంతా మోసం..అలగాజనం తెగబడ్తున్నారు.

వందల కోట్లు..వేలకోట్లు...రోడ్లు, బ్రిడ్జిలు, ప్రాజెక్టులు, క్వారీలు.. జలయజ్ఞాలు..ఫ్లైఓవర్‌లు..ఎత్తి'పోత'ల పథకాలు..బోదకాలు..

సరళాదేవి..సాక్షరతా మిషన్‌లు..ఎలుగుబంటి సూర్యనారాయణలు.. అరసవిల్లి దేవాలయంలో కిరణాలు సూర్యదేవుని పాదములనభిషేకించును.. ఔనా..శెభాష్.

ప్రతిరోజూ ఎవడో ఒకడు..ఎసిబి దాడులు..వందల లక్షలు..ఫిక్స్‌డ్ డిపాజిట్లు..కిలోల వెండి..కిలోల బంగారం...ఎకరాల భూమి.

తర్వాతేమౌతున్నారు వీళ్ళందరు..తర్వాత శక్తిమేరకు లంచాలిచ్చుకుని నిశ్శబ్దంగా మళ్ళీ సెటిలౌతున్నారు..మళ్ళీ లంచాలు తీసుకుంటున్నారు జయప్రదంగా.

ఒక్కన్నయినా బహిరంగంగా ప్రజలముందు విచారించి శిక్షించారా.

అయ్యా..నక్సలైట్ అన్నల్లారా నలభై ఏండ్ల మీ సుదీర్ఘ సాయుధ విప్లవోద్యమంలో ఒక్క అవినీతి అధికారినైనా కాల్చిచంపి షెబాసనిపించుకున్నారా. మీకెంతసేపు పోలీసులు, కోవర్టులు, ఇన్‌ఫార్మర్లు..ద్రోహులు. ఈ చింతేకదా..

మితిమీరిన మీడియా..కోతి హనుమంతుడైనట్టు ఒకే దూకుడు.. మంత్రిగారి మరదలు సమర్తయితే న్యూస్, సినిమా హీరో వుచ్చపోస్తే సెన్‌శేషన్, 'ప్రకటన' లిస్తే దేన్నయినా ప్రసారంచేసి అంగాంగాలు నులుముకుంటూ అతి విధేయం. ఎక్కుతే వంగు..వంగుతే ఎక్కు..'మీడియా' అంటే 'బ్లాక్‌మెయిలింగ్' చేయునదీ అని నిర్వచనం..ఔనా.

చానల్స్ ఎక్కువై.. స్వేచ్ఛ ఎక్కువై..నియంత్రణ పూర్తిగా మృగ్యమై..

స్వాతంత్ర్యం..విశృంఖలత్వమై...అరాచకత్వంగా మారుతూ..స్వేచ్ఛ.. అతిస్వేచ్ఛ...నాపత్రిక నాయిష్టం...నా చానల్ నాయిష్టం..నా శరీరం నా యిష్టమని ఒంటిపై బట్టల్లేకుండా రోడ్డుపై నగ్నంగా పోవచ్చా..?

కోట్లకు కోట్లు ప్రజలధనం..రోడ్లపేర, నిర్మాణాలపేర, ప్రాజెక్టులపేర.. ఒట్టి బూడిద, ఒట్టి దుబ్బ..చేయని పనులకు బిల్లులు..రెండు మూడురెట్ల దొంగ అంచనాలు..బహిరంగంగా పర్సెంటేజిలు..మేయర్‌కు, కమీషనర్‌కు, ఎమ్మెల్యేకు,

ఎమ్మెల్యేకి..పోలీసులకు, నక్సలైట్లకు కమీషన్లు. యిన్ని పోగా యిక మిగిలే 'నిర్మాణ'మెక్కడ..ఒట్టి ట్రాష్..కార్పొరేటరే కాంట్రాక్టర్..మినిస్టర్ బామ్మర్దే గ్లోబల్ బిల్డర్. అన్నీ బినామీలు..

ఇప్పుడు వేసిన రోడ్డు వచ్చే నెల ఉండదు

గత ఆర్నెల్లుగా కడ్తున్న వంతెన కమిషన్ చేయగానే కూలిపోతుంది.. డామ్ కొట్టుకుపోతుంది. వెంటనే ఎంక్వయిరీ కమిషన్..రిపోర్ట్ రాదు..వచ్చినా బుట్టదాఖలా.

'ప్రభుత్వం వెచ్చిస్తున్న ఒక రూపాయి లబ్ధిదారులకు ఐదుపైసలే ఐ చేరుతోందని' భావిభారత ప్రధాని రాహుల్ వ్యాఖ్య. తొంభై ఐదు శాతం అవినీతి–జనం స్పృహలో ఉండి ఆలోచించకుండా వీధికి రెండు వైన్‌షాప్‌లు..తాగుబోతుల డబ్బుతో ప్రభుత్వాలు నడుపబడ్డం.

పరిశ్రమల్లేవు..ఉత్పత్తి లేదు..యువకుల్లో దేశీయ స్పృహ లేదు. ఇది నాదేశం..వీళ్ళు నా ప్రజలు..యిక్కడి ప్రతి యువకుడూ తల్లివంటి ఈదేశంకోసం జీవించాలన్న మూలజ్ఞానాన్ని ఈదేశ బాలల్లో పాదుకొల్పే వ్యవస్థలేదు.

విద్యపేరుతో దోపిడి..కార్పొరేట్, కాన్సెప్ట్, టెక్నో, ఇంటర్నేషనల్, గ్లోబల్ స్కూళ్ళు. మూడవ తరగతి ఫీజు నెలకు ఇరవై రెండు వేలు.

ఏం జరుగుతోంది..అసలు ఏం జరుగుతోందిక్కడ,

విచ్చలవిడి బూతుసినిమాలు..'ఓరోరి యోగి నన్ను కొరికెయ్‌రా'.. పాటలు..ఆకాశంనిండా వందల ఫీట్ల ఫ్లెక్స్ హోర్డింగ్‌లపై స్తనసౌందర్య ప్రదర్శనలు..వీధికి రెండు ఇంటర్నెట్ పార్లర్స్..క్యాబిన్ల నిండా బూతు సైట్స్ వాచింగ్..గుట్కాలు, సెల్‌ఫోన్లలో బూతు ఎస్సెమ్మెస్‌లు..ఎనిమిదవ క్లాస్ పోరి టెన్త్‌క్లాస్ పోరనితో ప్రేమలు, లేచిపోవడాలు..

ఎవరికి ఎవరిపై నియంత్రణ లేదు..ఒకరిద్దరినే కంటున్న తల్లిదండ్రులు పిల్లలను గట్టిగా మందలిస్తే ఏం అఘాయిత్యం చేసుకుంటారోనని..సెల్ఫ్ బ్లాక్‌మెయిలింగ్.

అమ్మా మోటర్‌బైక్ కొనివ్వు..నాన్నా సెల్‌ఫోన్ కొనివ్వు..బిఎస్ఎన్ఎల్ 'స్టూడెంట్ కనెక్షన్' బొనాంజా..ఓ నా గౌరవనీయ ప్రభుత్వమా విద్యార్థులకు సెల్‌ఫోన్‌లెందుకురా నాయనా..బూతు ఎస్సెమ్మెస్‌లు చేసుకొమ్మనా.

అడవుల్లోపల ఎన్‌కౌంటర్లు..సిటీలోపల పేల్చివేతలు..బ్రిడ్జ్ పేల్చుతాం. రైల్వే ఇంజన్‌ను పేల్చివేస్తాం..బూటకపు ఎన్నికలను బహిష్కరించండి..నలభై ఏండ్లు దాటింది. గిరిజన నాయకులను ఇన్‌ఫార్మరని కాల్చివేస్తాం...కొత్తబంగారు లోకం ఎప్పుడో.

...అక్కడ..మావో పుట్టిన చైనాలో కమ్యూనిజాన్ని మూటగట్టి మూలన పెట్టి డెంగ్ జియావో పింగ్ ప్రజల సొంత ఆస్తి భద్రత బిల్లును ఆమోదించి

మావోను మరిచిపోయి ప్రపంచ ఆర్థిక ప్రగతిలో పరుగుతీస్తుంటే..ముక్కిపోయిన మృతసిద్ధాంతాన్ని పట్టుకుని ప్రజల్లోకి రాకుండా అడవుల్లో ఉంటూ..ఓ పెద్ద దిక్కుమాలిన సిద్ధాంతాలపై చర్చ.

కొత్త పాతై, పాతొక రోతై..శాస్త్రీయతంతా సాపేక్షమై పరిఢవిల్లుతున్న గర్జించే శాస్త్రీయ వాస్తవంలో జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న సోకాల్డ్ మేధావులు.,

ఎక్కడో ఏదో..దారితప్పుతోంది.

అంతా సజావుగా అనిపిస్తూనే, కనిపిస్తూనే వ్యవస్థ గాడితప్పి ఒక భయంకర విధ్వంసంలోకి దూసుకుపోతోంది. ప్రజాకర్షక పథకాల మాయాజాలంతో ప్రజలను బిచ్చగాళ్ళుగా, పనిదొంగలుగా, సోమరులుగా ప్రభుత్వాలే తీర్చిదిద్దుతూ, మార్కెట్లను విచ్చలవిడితనపు సర్వసౌఖ్యాలూ అనియంత్రిత విస్ఫోటనంగా ముంచెత్తుతూ...

అంతా కకావికలైపోతోంది..సంస్కృతి, సభ్యత, విద్య, నీతి, నైతికత. ప్రమాణాలు, నైపుణ్యాలు, నాణ్యత అన్నీ ధ్వంసమౌతూ..ఆకాశమంత ఎత్తుతో ఏదో అదృశ్య కెరటం ఈతరంపై దాడి చేయబోతోంది.

ఇప్పుడేంజేయాలి..ఎలా ఈ నివురుగప్పిన నిప్పులా ఉన్న ప్రమాదాన్ని బట్టబయలు చేయాలి. కుమ్ములో కుతకుతా ఉడుకుతున్న ఈ దుస్థితిని ఎలా బహిర్గతం చేసి దారితప్పుతున్న నదిలాంటి జనాన్ని మళ్ళీ సరియైన దిశలోకి మళ్ళించాలి.

ఒక మాయామేయమోహంతో సమాధియైపోతున్న ఈతరాన్ని ఎలా రక్షించాలి.

ఎలా?

ఎలా?

## 3

అందంపేరిట హుస్సేన్‌సాగర్ నిండా వ్యాపించిఉన్న మురుగునీటి కంపును ఎప్పటినుండో అనుభవిస్తున్న తేజ వెనుకనుండి వినబడ్డ ఏదో బలమైన శబ్దానికి ఉలిక్కిపడి..వెనక్కి తిరిగి,

కార్పొరేషన్ గార్బేజ్ ట్రక్ క్రేన్ హుక్‌ను రోడ్ ఫుట్‌పాత్‌పై ఉన్న ఇనుపచెత్త ట్యాంక్‌కు తగిలించి ట్రక్‌లోకి లేబడ్తున్నారు..

ట్యాంక్‌నిండా చెత్త..ఓవర్ ఫ్లో ఐ పొంగి దొర్లుతూ, కారుతూ. చెత్త...జారుతూ చెత్త..ఒకటే దుర్వాసన..ముక్కుపుటాలు పగిలిపోయేట్టు.

వీధుల్లో నీతినియమాలు లేని జనం చెత్త..విలువలు లేని ఉద్యోగులు, నైతికత లేని నాయకులు..పైరవీలలో బతికే ఉద్యోగులు..చెత్త. నామమాత్రపు విలువలేని డిగ్రీలను చేతుల్లో పట్టుకుని లక్షల విద్యార్థులు..అవినీతి డబ్బుతో

మురిగిపోతున్న నిల్వల్లో రాజకీయ రాక్షసులు..అంతా చెత్త..చెత్త. హుసేన్‌సాగర్ నీళ్ళవలె ఇంపైన కంపు.

చెత్తకుండీ వాసన భరించరాకుండా ఉంది.

అప్రయత్నంగానే తేజ ముక్కు మూసుకున్నాడు...చెత్త ట్యాంక్ తన ప్రక్కనుండే గాలిలో కదులుతూ ట్రక్‌పైకి చేరుతోంది.

శుభ్రం చేయాలంటే చెత్తను తొందరగా తొలగించాలి.

ఎలా..ఎలా..ఎలా.

చెత్త ట్రాక్టర్‌ను తదేకంగా చూస్తున్న తేజ ముందునుండి ఐదు నిముషాల తర్వాత ట్రాక్టర్ వెళ్ళిపోయింది.

వాసన..కంపు..వెళ్ళిపోతోంది..క్రమంగా..దూరంగా.

తేజ ప్రక్కనున్న సంచీలోనుండి తన డైరీని తీసుకున్నాడు చకచకా - ఆరోజు పేజీ..జూన్ 12వ తేదీ కాగితాన్ని వెదికి,

ఈరోజు పాఠశాలలు వేసవి సెలవుల తర్వాత తిరిగి తెరువబడ్తున్నాయి. నేను ఈ సమాజ ప్రక్షాళన కోసం, ఒక కొత్త తరాన్ని నిర్మించేందుకు ఒక ప్రాథమిక పాఠశాలలో అధ్యాపకునిగా చేరాలి..నావంటి ఆలోచనలేగల ఒక యువ సమూహాన్ని తయారుచేయాలి..ఒక దీపంనుండి మరో దీపం అంటుకుని వెలిగి, మండి, జ్వలించాలి.

అని..ఇంకా రాస్తూ...

ఒక వ్యక్తి...ఒక ఆలోచన..ఒక దేశాన్ని మార్చిన సందర్భాలున్నాయి కదా !

తెల్లవారుతోంది..,

●